# తెగిన బంధాలు

పెద్దింటి అశోక్‌కుమార్



**"బస్సు వచ్చే టైం అయింది. ఈ బాలయ్య మామ ఇంకా రాకపాయె. నిన్న కలిసినప్పుడు పదేపదే చెప్పిన. ఉడుముగుడ్లు పెట్టి మర్చిపోయినట్టు జేస్తడు. పొద్దుటి బస్సుకు పోవాలనే అనుకుంటిమి." పొద్దుపొడుపుకు చేతిని అడ్డం పెట్టుకుని దారిపొడుగునా చూస్తూ విసుక్కున్నాడు లింగం. అతడి మాటల్లో విసుగుకంటే ఎక్కువగా బాధనే ధ్వనించింది. బస్సు ఎక్కడ వెళ్ళిపోతుందో అనే తొందర ఒకవైపు, బాలయ్య రాలేదనే బాధ మరోవైపు కలగలిపి అతడిని ఉన్నచోట ఉండనీయడంలేదు. నిప్పును తొక్కిన కోతిలా తిరుగుతున్నాడు.**

అతడి పక్కనే రాళ్ళతెట్టెమీద కూర్చుని నెమ్మదిగా బీడి తాగుతున్నాడు దేవయ్య. లింగం బుడ్డగోచిని సర్దుకుంటూ అటూ ఇటూ తిరగడం, వదరడంఅతడికి తమాషాగా ఉంది. "ఔ... మంగలోల్లమామా! నువ్వు గోర్లు తీసే గోరుగాలు, ఇత్తడిగిన్నె గోచిల పెట్టుకుని తొందరగా వస్తివి. కుమ్మరోల్ల తాతకు నీలెక్కన రావస్తదా! కూరాళ్ళు, ఐరేండ్లు, గరిగె బుడ్లు, కంచుళ్ళు మూటగట్టుకుని రావాలెనాయె. కొద్దిగ ఆలస్యమైతది. నువ్వేదో కొంపలు మునిగిపోయినట్టు చేస్తున్నవు." బీడి దమ్ములాగి పొగలను వదులుతూ వెక్కిరిస్తున్నట్టుగా అన్నాడు చేతులు తిప్పుతూ.

ముందుకు రెండు అడుగులు వేసిన వాడల్లా చెవులు రిక్కించి వింటూ వెనక్కి వచ్చి, దేవయ్య భుజాన్ని పట్టి కుదుపుతూ అన్నాడులింగం ఎక్కసంగా. "దొర్సాని వైనాల మనిషి, అన్నీ పద్ధతి ప్రకారం జరగాలంటది. కొద్దిగ లేటయిందనుకో... మనకు ఇచ్చే కట్నాలు ఇయ్యరు. పెండ్లీల ముందు ముందుగ కుమ్మరోళ్ళ పనే మొదలాయె. గాడిపొయ్యిలు తీసి కూరాళ్ళు చేసి లెంక కంకణాలు కట్టినాకనే గదా.. పెండ్లి పనులు మొదలయ్యేది. నేను గిన్నె, గోరుకాలును దెత్త. నువ్వయితే ఉత్త చేతులతోని రావడితివి. వచ్చేప్పుడైతే తూమెడు బియ్యం, వెయ్యి రూపాయలు ముల్లె కట్టుకచ్చుకుంటవు."

దేవయ్యకు కోపం వచ్చింది. లేచి నిలబడి ప్యాంటును దులుపుకుంటూ విసురుగా అన్నాడు. "నువ్వు చేసే పనేముందట. పది నిమిషాలు మైలపోలు రాసే తూమెడు వడ్లు తెచ్చుకుంటవు. పోలు మీద పెండ్లి పిల్ల కట్టుకున్న బట్టలు నీకేనాయె. మీది కెళ్ళి నూటపదార్లు కట్నం. నేను పెండ్లి పత్రిక పెట్టు కుంది మొదలు. పత్రికలు పంచితిని. ఇక్కడున్న ఇంటికి సున్నమేస్తిని..." దేవయ్య గొంతు ఆడపిల్ల గొంతులా సన్నగా ఉంటది. దానికి తోడు చేతులు, తల ఆడిస్తాడు.

అతడి మాటలు పూర్తి కానేలేదు. అందుకున్నాడు లింగం.

"ఆ... చేసినవు తియ్యిరా! పటేలు సిరిసిల్లలో ఉన్నాడు కాబట్టి సరిపోయింది. లేకుంటే వచ్చిపోయే సుట్టాల బట్టలు ఉతుకలేక చచ్చిపోదువు. అయినా చేసినందుకు ఏం చెడిపోతున్నావురా! కూరగాయలు కొండబోతే కట్నం, పోలుపోస్తే కట్నం, గొర్లను కోస్తే కట్నం, బోళ్ళు తోమితే కట్నం, పీతిరికట్నం, పెండ్లి సామాన్లు ఎత్తకపోతే కట్నం..."

బస్సు చప్పుడు వినిపించింది. లింగం నోరు మూతపడింది. దేవయ్య కూడా మారు మాటాడలేదు. తొందరగా రోడ్డు మధ్యలోకి వచ్చి అటూ ఇటూ పారచూసి 'ఓ... బాలయ్యతాతో..' అని కేకవేసాడు.

లింగం ఆతృతగా రాళ్ళతెట్టెని ఎక్కి నిలబడి రోడ్డుకు అవతలివైపు పారచూసి అన్నాడు. "ఆ... వస్తుండు. వీపుకు ముల్లె వేసుకుని కోటగడ్డ దిగుతుండు" అని. "మామా... జెట్టనరా... బస్సు వస్తంది" అని కేకవేసి తెట్టె అంచుని పట్టుకుని కిందికి దుంకాడు.

"ఆ... ముసలాయిన కోడెదూడయితున్నడు. దుంకులాడుతున్నడు." నవ్వుతూ అన్నాడు దేవయ్య నడుమును ఊపుకుంటూ.

"ఇప్పుడేం చూసినవు. నీ ఈడుకు ఉన్నప్పుడు కబడ్డి ఆడితే నలుగరిని ఎత్తుకత్తుంటి. ఇప్పుడు నీతోని ఉడికినపప్పు ఉడుకది." మీసాలను దిద్దుకుంటూ అన్నాడు. అప్పుడే దుమ్ములేపుతూ బస్సు వచ్చింది. దమ్ము ఎగపోస్తూ బాలయ్య కూడా వచ్చాడు. చేతిలో ఉన్న సంచిలో మూడుకుండలు, వాటిమీది కంచుళ్ళు ఉన్నాయి.

సంచివైపు తేరిపార చూసిన లింగం పెదవిని విరుస్తూ "అదేంటి మామా... మూడే ముంతలు తెస్తున్నవు. కూరాడు కుండలేవి...?" అన్నాడు ఆశ్చర్యంగా. అతడికి ఏదో భయం మొదలయింది.

"ఈ మూడుముంతలకే మూడు ఇండ్లు తిరిగిన. వాటిని ఎక్కడ తేవాలె. అయినా ఇప్పుడు కూరాళ్ళు గాడిపొయ్యిలు ఎవలుదీస్తుండ్రురా... అంతలావు గంటే ఇత్తడి బిందెలు పెట్టుమంట. అంతదూరం ఐదుపది కుండలను ఎట్ల తీసుకెళ్ళాలె." నెమ్మదిగా అన్నాడు బాలయ్య. గొంతు వణికింది. వయసు పైబడి ముడతలు పడ్డ చర్మం.

"నీ పని అయినట్టే. దొర్సాని సంగతి కొత్తగ చూస్తున్నవా...? ఏది లేకున్నా ఊకుండది. నిన్ను మళ్ళీ ఇంటిదాక ఉరికిత్తది" నవ్వుతూ అంటూ బస్సువైపు చూసాడు దేవయ్య.

బస్సుకు అదే చివరి స్టేజి. అక్కడినుండే వెనక్కి తిరిగి సిరిసిల్ల వెళ్తుంది. రోడ్డు పక్కనే తవ్విన పునాది. అది నింపడానికి కుప్పలా పోసిన రాళ్ళు, ఇసుక, ఒకవైపు కాంక్రీట్ కుప్పలు. బస్సు మరలడానికి ఇబ్బందిగా ఉన్నది. డ్రైవర్ విసుక్కుంటున్నాడు.

"అరే ఆడిగుట్లోడా... పక్కకు జరుగురా" వెనుకనుండి ఎవరో అన్నారు దేవయ్యను.

కోపంగా తిరిగి చూసాడు. ఎవరూ కనిపించలేదు. తనలోతానే గొనుక్కుంటూ పక్కకు జరిగాడు. బస్సు మలుగుతుంది.

"ఇక్కడ ఏం కడుతున్నారు. బంగళానా...?" ఎవరో అన్నారు.

"కాదు. బస్టాండ్" మరెవరో.

"కాదు. కాదు. మ్యారేజిహాల్... కొండల్‌రావు పటేల్ కట్టిస్తుండు." ఎవరో అన్నారు.

"ఆ... ఆగనీ..." చేతిలో ఉన్న పంచ్‌తో రాడ్‌పై టక్‌మని కొట్టి అన్నాడు కండక్టర్. అంతవరకూ ఎక్కడ కూర్చున్నారో కానీ పదిమంది వరకూ జమయ్యారు.

అందరూ ఎక్కి కూర్చోగానే బస్సు ముందుకు కదిలింది. ఎత్తుపల్లాల రోడ్డు.

'ఐరేండ్లు, గరిగెబుడ్డి పైలం తాతా... ఏ ఒక్కటి బిన్నమైనా వట్టిదే" హెచ్చరిస్తున్నట్టుగా అంటూ "లింగం మామా నీ గోరుగాలు మెత్తగనూరుకున్నవాలేదా?" అన్నాడు దేవయ్యనవ్వుతూ. బస్సు చప్పుడులో మాటలు ఎవరికీ వినిపించలేదు.

అప్పుడప్పుడే పొద్దుకొద్దిగా పైకెక్కుతుంది. కొద్ది కొద్దిగా చలిగా ఉంది. సన్నగా వణుకుతూ సీట్లో ఒదిగి కూర్చుని గురుగుల కంటె పెద్ద సైజులో ఉన్న మూడు పటువలను భద్రంగా పట్టుకున్నాడు బాలయ్య. పైకి అలా అన్నాడుకానీ కూరాడుకుండలు లేకపోవడం వెలితిగా భయంగా ఉన్నది. ఎలాగో కష్టపడి ఐదు కుండలు సంపాదించేవాడే! మధ్యలో పంచాది మొదలై ఎటూ తేల్చుకోకుండా చేసింది. ఒకడు బతికిపోతున్నాడంటే ఒర్వరు. పాడుమంది.

"ఏంటిదిమామా... నిన్న ఏదో పంచాది ఉన్నదంటివి. ఏం పంచాది." పక్కనే కూర్చున్నాడు లింగం. కాల్లుజాపి సర్దుకుని కూర్చుంటూ అడిగాడు బాలయ్యను.

"ఏం పంచాదిరా... కండ్లచ్చినప్పుడు ఎవ్వడులేడుగనీ సండ్లచ్చినప్పుడు అందరు మొగోళ్ళమంటరు. కొండల్‌రావు పటేల్ పొత్తుల మనిషట. ఊళ్ళో లేడు కాబట్టి కుండలు పొత్తుతోనే ఇచ్చి వచ్చిన కట్నాలు అందరం పంచుకోవాలంటరు.

**ఆటా- వార్త సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ**

ఇక్కడున్నప్పుడు కొడుకు పెండ్లి చేసిండు. అప్పుడు నేనే ఇచ్చిన. పండుగు పబ్బాలకు పటేలు ఊళ్ళో ఉన్నంత మట్టుకు కుండా, గురిగి నేనే ఇత్తిని. పోయినేడు పెద్దపటేలు సచ్చిపోతే కొత్త కుండ నాదే. ఇయ్యాల్ల వీళ్ళు కొత్తగా కానూన్ తీస్తే నేను ఒప్పుకుంటనా...?" గొంతు వణుకుతున్నా, గట్టిగా అన్నాడు బాలయ్య. "నా ముంగట లాగులు తొడిగి నోళ్ళు నాకు చెప్పే మొనగాళ్ళయిండ్రు" గొంతు గరగరమంది. వయసుతెచ్చిన ఆయాసం.

లింగం గొంతు కూడా అతడి ఆకారంలా గంభీరంగా ఉంటది. వయసు మీద పడి కొద్దిగా కుంగిపోయాడుకాని చెయ్యెత్తు మనిషి, మనిషికి తగిన చెత్త. "మాకులపోళ్ళు అట్లనే అనడం మొదలెట్టిండ్రు. నేను సందియ్యలేదు. ఎవ్వడు నోరు ఎత్తద్దని చెప్పిన. పెద్దమనిషి కాలంజేసిప్పుడు నేనే గుండ్లు కొరిగితి. నేను నాలుగు మాటలనంగనే ఎవ్వడు నోరెత్తలేదు". అన్నాడు. "ఇయ్యాల్ల ఇన్ని కట్నాలు దొరుకుతయిగదా! ఎట్ల దొరుకువట్టే అనేమంట..."

"అందరికంటే మా కులమే నయ్యం. కష్టపడితెనే కట్నమత్తది. చేసుకోరా అన్నరు. ముందుగా ఊరెళ్ళిపోయిన మనిషి పొత్తులకే వస్తడని గులిగినా శాతసాకలోనివి నీకే హక్కుంటది. నీతోకాదంటే చెప్పమన్నరు" వెనకసీట్లో కూర్చున్న దేవయ్య ముందుకు వంగి అన్నాడు. వాళ్ళ మాటలు విన్నాక.

"ఓ ముచ్చట... మీ ముచ్చట మీదేనా? టిక్కెట్లు తీసుకోండ్రి. యాడికిపోవాలే" కండక్టరు గద్దించాడు. ఇద్దరు డబ్బులు తీస్తుంటే తర్వాతలెక్క చూసుకుందామని ఆపి యాభైనోటు ఇస్తూ 'మూడు సిరుసుల్ల' అన్నాడు దేవయ్య.

బస్సు వెళ్తుంది. బస్సుతోపాటు ఆలోచనలు కూడా. ముగ్గురిలో ఉత్సాహం, అంతకుమించి ఆనందం ఉంది. రెండేళ్ళ కింద కొండల్‌రావు కొడుకు పెళ్ళి గుర్తుకొచ్చింది. గాడిపొయ్యిలు తీసి కూరాళ్ళకు లెంక కంకనాలు వేసినందుకే నూటపదార్లు కట్నమిచ్చాడు. ఐరేండ్లు గరిగ బుడ్డిని ఎదురుకోవడానికి చప్పుడుతో వచ్చినప్పుడు ఐదుతవ్వల ఒడిబియ్యం కుడుకా, కనుముబట్ట, యాభైఒక్క రూపాయి కట్నమిచ్చాడు బాలయ్యకు. పెండ్లి తర్వాత ఇంటికట్నం వేరే ఇచ్చాడు.

సాకలి దేవయ్యకైతే అప్పుడు నెలరోజులు పండుగనే. అక్కడే తిని అక్కడనే ఉండుమన్నాడు పటేలు. దొరసాని మాట దురుసుగని ఎముకలేని చెయ్య. పెండ్లి పోలుపోసేటప్పుడు రెండుసంచుల బియ్యం పోసుకున్నా ఎవరూ ఏమనలేదు. ఐదుగొర్లను కోస్తే వాటి కాళ్ళు, తలకాయలు, అర్రలబొత్తలు, దొబ్బలు... కులానికంతా పంచిపెట్టిండు. ఇంటికి సున్నంవేస్తే మనిషికి మానెడు బియ్యం, ఇరువైరూపాయలు, ఇంటి సాకలి కట్నం అదనంగా ఇచ్చిండు. పత్రికలు పంచడానికి బస్సుకిరాయిలిచ్చి పెండ్లి అయినంక ఇద్దరాలుమగలకు బట్టలు పెట్టి ఇంటి కట్నం ఐదువందలిచ్చిండు. పటేలు ఇల్లు సల్లగుండ!

మంగలి లింగం మైలపోలు రాసి తూమెడువడ్లు పోలుపోసుకున్నడు. పోలు రాసినప్పుడు పిల్లగాని పెయ్యిమీది గొత్తగి లుంగి ఇచ్చిన నూటపదార్లు కట్నమిచ్చిండ్రు. రెండుమూడురోజులు కడుపు నిండా తిండి. చిల్లర పనులు చేసినందుకు వేరే కట్నం. దొర్సాని కడుపు సల్లగుండ! మిగిలిన అన్నంకూర పెట్టిచ్చింది.

సున్నం వెయ్యడంతో మొదలైన సందడి నల్లపూసలు అల్లడంతో ముగిసింది. అంతవరకూ ఏదో పనితో ముగ్గురూ ఇంటిచుట్టే తిరిగేవారు. ఒక్కొక్కరికీ ఆరు నెలలగాసం దొరికింది. బిచ్చగాళ్ళకు గరీబోళ్ళకు మూడుపూటల తిండి.

బస్సు ఒక్క కుదుపుతో ఆగింది. ముందుకు తూలిపడబోయి నిలదొక్కుకున్నారు. బాలయ్యనైతే ముంతల్ని గట్టిగా పట్టుకున్నాడు. ఆలోచనల్లోంచి తేరుకుని అటూఇటూ చూసి "ఊరులేదు. పల్లెలేదు. ఇక్కడెందుకు ఆపినవు" అన్నాడు దేవయ్య రెండు చేతులను ముందుకు చాపి మట్టలను తింపుతూ.

'ఆ... కట్టమైసమ్మ బండిని జరుగనియ్యదట. దిగి ఆసరపడుతవా?" అదే యాసతో అంటూ బస్సు దిగాడు డ్రైవర్. అందరూ నవ్వుకున్నారు.

"బస్సు పాడుగాను. ఇది ఇప్పుడే ఆగిపోవాల్నా. ఇంకా మెట్టుగుట్టలన్నా దాటలేదు. నడిచిపోదామన్నా లింగన్నపేట దగ్గరలేదు. ఇంకో బస్సు ఇప్పుడు రాదు." లేచి నిలబడి చేతులు తింపుకుంటూ అన్నాడు దేవయ్య మళ్ళీ అలాగే.

"నీ ఆడిగట్ల పీసునకొడుదు. ఒర్రకు" ఎవరో అన్నారు.

"లావురేషం రావట్టె నీకు. ఏం నొత్తుంది." బస్సు దిగాడు దేవయ్య గొణుక్కుంటూ.

అరగంటసేపు కుస్తీపట్టి బస్సు ఇక కదలదని చెప్పాడు డ్రైవర్. బస్సులో ఉన్న పదిమంది ప్యాసింజర్లు కండక్టర్‌తో వాదనకు దిగారు. "టికెట్టు చించినాక డబ్బులు ఇయ్యమంటే ఎలా...? రోడ్డు దాకా నడువండి. అక్కడ వేరేబస్సు ఎక్కిస్తా." అన్నాడు కండక్టరు చివరగా. ఉసూరుమంటూ బస్సు దిగారు.

చుట్టూ గుట్టలు. వాటిని చీల్చుకుంటూ రాళ్ళు తేలిన కంకరరోడ్డు. అక్కడక్కడా బీడువారినోళ్ళు తెరిచిన పంట పొలాలు. వర్షాలు లేక గడ్డికూడా మొలవలేదు. గుట్టలమీద చెట్లు వాడిపోయినట్టున్నాయి. మంచు కురిసే కాలమైనా ఏ ఆకు మీదా తేమలేదు.

డ్రైవర్ బస్సు వద్దే ఉన్నాడు రోడ్డును తిట్టుకుంటూ. కండక్టర్ వడివడిగా నడుస్తున్నాడు. మిగిలినవారంతా అతడివెంట ఎక్కడ తప్పించుకుని పోతాడో అన్నట్టుగా నడుస్తున్నారు. బాలయ్య మాత్రం ముల్లెను నెత్తిన ఎత్తుకుని మెల్లమెల్లగా నడుస్తున్నాడు. అతడికంటే రెండడుగులు ముందుగా భారీ శరీరాన్ని కదుపలేక కదుపుతున్నట్టుగా నడుస్తున్నాడు లింగం. వడివడిగా వెళ్తున్నవాడల్లా వెనక్కి తిరిగి ప్యాంటును ఎగజెక్కుకుంటూ 'ఏమాయె... రాండ్రి' అంటూ ఆగిఆగి నడుస్తున్నాడు దేవయ్య.

*లింగం ఆత్రుతగా రాళ్ళతెట్టెని ఎక్కి నిలబడి రోడ్డుకు అవతలివైపు పారచూసి అన్నాడు. "ఆ... వస్తుండు. వీపుకు ముల్లె వేసుకుని కోటగద్ద దిగుతుండు" అని. "మామా... జెట్టనరా... బస్సు వస్తంది" అని కేకవేసి తెట్టె అంచుని పట్టుకుని కిందికి దుంకాడు.*



"నేనంటే ముసలోన్నయితి. నీకేమైందిరా... అడుగుల అడుగేత్తున్నవు. నడువు" సరాయిస్తూ అదిలించాడు బాలయ్య.

"నాకింక వయసు ఉరుకులాడుతుందా... యాభై దాటినయి. మోకాళ్ళు కదులనిత్తలెవ్వు." అడుగులు వేగంగా వెయ్యడానికి ప్రయత్నిస్తూ అన్నాడు లింగం.

"ఆ... మీరు ఇట్లనడిస్తే పెండ్లికికాదు. మరువెండ్లికి అందుతం. ముడితె బతుకనిపిల్ల ముద్దాడితె బతుకతదా అన్నట్టు చాతగానోల్లు ఇంటి దగ్గరనే ఉండాలె. ఎందుకు ఆరాటపడాలె." విసుగ్గా అన్నాడు దేవయ్య.

"నువ్వు ఉరుకులాడకురా... ఒకసారి గిట్లనే! ఇదే కొండల్‌రావుపటేల్ లగ్గానికి మీనాయిన ఉరుకులాడుకుంట సవారు కచ్చురం ఎక్కిండు. అప్పుడు ఇట్ల బస్సులు ఎక్కడివి. ఎంతదూరం పోవాలన్నా కచ్చురాలెనాయె. లగ్గానికి ఇరువై కచ్చురాలు బయలెళ్ళినయి. ఒకలను పట్టక ఒకలు పైగొట్టుడు మొదలుపెట్టిండ్రు. మీ నాయిన ఎక్కిన కచ్చురం ఎడ్లునడువలేదు. మెల్లెమెల్లెగ అదిలిచ్చుకుపోతుంటే ఉన్న కచ్చురాలన్నీ వెళ్లిపోయినవి. కొత్త తొవ్వ. జంగల్‌లో కాటగలిసింది. మేము పొద్దుగూకతుండంగ పెండ్లిపిల్ల ఊరుకు చేరుకున్నం. మీనాయిన ఎక్కిన బండి ఇగరాదు. అగరాదు. కూరుకురాత్రి దాటింది. చిత్రమేంటిదంటే తలువాలు బియ్యం, గరిగె బుడ్డి, పెండ్లి బట్టలు ఆ బండిలనే ఉన్నయి. తెల్లారెముంగట పెండ్లి. ఎక్కడివాళ్ళమక్కడ కేకలేసుకుంట తిరిగినము. యాడదొరుకడు. ఎటెటు తిరిగిండో జరాగితె పెండ్లనంగ చేరుకున్నడు. అప్పటిగ్గాని పాణాలు సల్లవడలేదు." చెబుతూ నడుస్తున్నాడు బాలయ్య.

ముందటి గుంపు దూరమయింది. అందుకోవాలని వేగం పెంచారు.

"అబ్బో... వీళ్ళనాయిన సన్నపోడు గాదు..." ముచ్చట అందుకున్నాడు లింగం. "... చేసినంతసేపు పనిమంచిగనే చేస్తుండె. కల్లువాసన చూస్తే మాత్రం మన మనిషి కాకపోతుండె. ఇట్లనే ఇద్దరం తలువాల బియ్యమెత్తుకుని ముకుందరెడ్డి కొడుకు పెండ్లికి పోయినం. ఆ ఊర్లె బాగ గాడుదులున్నయి. పెండ్లికి కొబ్బరాకుల ముత్యాల పందిరేసి గద్దెవేసి పూలదండలు చుట్టిండ్రు. ఇప్పుడు ఇట్లగని అప్పుడు ఏలగ్గమైనా తెల్లారెముందటనే అయితుండె. పొద్దందాక లగ్గాలే జరుగకపోతుండె.

ఇగ పిల్లగాన్ని ఎదురుకచ్చెదానికి పోతూ పందిరి దగ్గర మీ నాయినను కావలిబెట్టిండ్రు. అప్పుడు ఎదురుకునేందుకు జీబులెక్కడియి. ఉన్నమారాజులైతే గుర్రంమీద ఎక్కిచ్చుకత్తురు. ఏంలేనోళ్ళు నడిచివత్తురు. వాళ్ళమామ ఎక్కడిదో డొక్కుసైకిలి పట్టుకచ్చినాకు ఇచ్చిండు. పిల్లగాన్ని దానిమీద కూసోబెట్టుకుని తోసుకరావాలె. చీకటిపూట ఎదురుకోనుడు. ఊరిమంగలోడు దీటి వట్టుకుని ముందట నడువాలె. అంతవరుదాక నేను సైకిలును ముట్టనేలేదు. భయంభయంగనే తోసుకత్తున్న. ముందట మాదిగిదప్పులు. అక్కడో గురుజు ఉంది. దానికిందమోరి. అయింత పైడికాలుకు తట్టి ముందుకు సాలిగిన. చేతిలసైకిలి పిసికిపోయింది. సైకిలి మీదున్న పెండ్లిపిల్లగాడు మోర్లెకూలిండు. పెయ్యంతా... బట్టలంతా బురుదనే..."

"నీ మొద్దుపీసునె గొడుదు..." పెద్దగా నవ్వుతూ అన్నాడు దేవయ్య.

"పందికి పంది ఉన్నవు. సైకిల్ నూకరాలేదా...?" బాలయ్య ఆయాసపడుతూ నడుస్తున్నాడు. అప్పుడప్పుడూ చేతిని అడ్డం పట్టి తారురోడ్డు ఎక్కడ ఉందో చూస్తున్నాడు.

"...ఇంక మీ నాయిన సంగతి చెప్పుతసూడు. తలువాల బియ్యం. కుడుకలు, పోకల ముల్లెపక్కన బెట్టుకుని పందిరికావలున్నడు. అప్పటికే రెండుమూడు సీసలకల్లు దాగిండట. నడిజాము రాత్తిరాయె. నిద్ర ఆగక అట్లనే ఒరిగిండట. ఊంత గాడుదులురాను. ఒక్కపువ్వు లేకుండ గుంజినయి. గద్దెను తుక్కుతుక్కు తొక్కినయి. పందిరిని కూలగొట్టినయి. తలువాల బియ్యం ఇత్తులేకుండ

బుక్కినయి. దూరంగా సప్పుడినచ్చిలేచి చూసెవరకు ఏముంది! అంగడంగడయింది. ఇగనన్ను ఉంచరురా అనుకున్నడు. ఇంటితొమ్మ వట్టిండు. సైకిలి ఎత్తెయ్యంగనే నేను అదేవనిజేసిన... ఇద్దరం మెలకుంట్ల కలిసినం కరకర పొద్దు పొడవంగ."

పడిపడీ నవ్వుతున్నాడు దేవయ్య. బాలయ్యగూడా నవ్వుతున్నాడు. కండక్టర్ కేకవేయడంతో నడకవేగాన్ని పెంచారు. దూరంగా తారురోడ్డు కనిపిస్తుంది. అప్పుడప్పుడు లారీలు, జీబులు వెళ్తున్నాయి. బాలయ్య సత్తువనంతా కూడదీసుకుని నడుస్తున్నాడు. అతడి భుజంమీది మూటను దేవయ్య అందుకున్నాడు.

"ఇది ఆకిరి లగ్గం. ఈసారి బాగనే వస్తయి కట్నాలు." మూటను మార్చుకుంటూ అన్నాడు దేవయ్య. ఈ కట్నాలతో ఎక్కడెక్కడి బాకీలు తెపాలెనో ముందుగానే నిర్ణయించుకున్నాడు. బియ్యం సంచి కూడా కొనలేదు ఇంటికి.

"లగ్గం ఊర్లె జేస్తే మనకు సతువుండు. ఎరుగని ఊర్లెమొరుగని కుక్క. అన్నట్టు అక్కడ ఎట్లున్నదో" నిరుత్సాహంగా అన్నాడు లింగయ్య.

"ఎట్లుండుడేంది. పటేలు మనల్ని తప్పకరమ్మని చెప్పె. నిన్నయితే మరీమరీ యాది జేసిండు..." నడుస్తూ అన్నాడు దేవయ్య. "మనం లేనిది లగ్గమెట్ల చేస్తరు నీ ముచ్చటగని. నలుగురితో చెప్పి పంపిండు."


"ఇప్పుడు ఇట్లగనీ... ఎనుకట పెండ్లీలు మూడురోజుల పొదురు. ఒక ఇంట్ల పెండ్లి అయిందంటే అన్ని కులాలకు పని దొరుకుతుండె. ఇప్పుడు పెండ్లి పనుల్లోంచి ఒక్కొక్క కులం ఎడబాసిపాయె. ముగ్గురమే మిగిలితిమి." నిట్టూరుస్తూ అన్నాడు బాలయ్య.

మాటల మధ్యలోంచి తలెత్తి చూస్తే తారురోడ్డు కనిపించింది. రోడ్డుపైకి ఎక్కగానే ఎదురుగా ఒక బస్సు వచ్చింది. అందరినీ బస్సులోకి ఎక్కించాడు కండక్టరు. అందరూ ఆయాసంగా బస్సెక్కారు.

"బస్సు సల్లగుండ. పెట్టేపైసలు తప్పకపాయె. నడుసుడు తప్పకపాయె." చేతులు తిప్పుతూ అని సీట్లో కూర్చున్నాడు దేవయ్య.

"ఆడిగుట్లోళ్ళు ఎక్కితే అట్లనే ఉంటది మరి" వెనకనుండి ఎవరో అన్నారు. తెలిసినవారు గొల్లున నవ్వారు. కోపంగా వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ కనిపించలేదు. ఆ కోపాన్నంతా లింగం మీద చూపిస్తూ 'ఈ రుమాలు ఎందుకు చుట్టుకత్తున్నవు. ఇంటి దగ్గర పడేసిరాక' అన్నాడు దేవయ్య.

అతడి కోపానికి లోలోపల నవ్వుకుంటూ సరాయించి మీసాలను సవరించుకుంటూ "నీకు తెలువదోయ్. మైలపోలు రాయంగ నెత్తికి రుమాలు ఉండాలె. లేకుంటె దొర్సాని మెడలు వట్టి ఇవుతలికి నూకుతది. వాళ్ళ కొడుకు పెండ్లీల ఏమైంది ఎరుకేనా...? పెండ్లిపోలు పోసినంక పిల్లగాడు పోలులో అడుగుపెట్టేదాక సాకలోడు బయటకు రావద్దట. ఆ విషయం అక్కడి సాకలోనికి తెలువది. దబదబ పోలుపోసి పోదామనుకున్నడట. నాలుగుతిట్టి పిల్లగాడు పోలులోకి అడుగువెట్టేదాక ఇవుతలికి రావద్దని చెప్పిందట. అప్పటికింకా పెండ్లి పిల్లగాడు తయారుకానేలేదు. సాకలోనికి ఒత్తుగ దొడ్డకత్తుందట. ఇగజెప్పు. ఆ



టెంట్ మాత్రం వేసి ఉంది. పచ్చటి తోరణాలు గుచ్చారు. పిల్లను పెండ్లికూతురుగా తయారుచేయడానికి బ్యూటీషియన్‌ను తెప్పించారని విని ఎందుకో తెలియక తికమకపడ్డారు ముగ్గురు. బ్యాండు చప్పుడు, పసుపులు ముట్టుడు... ఈ సందడేమో కనిపించడంలేదు.

కథ ఎట్లున్నదో" అన్నాడు నవ్వుతూ.

కోపాన్ని మరిచి పక్కున నవ్వాడు దేవయ్య. చుట్టూ ఉన్నవారు వారివైపు విచిత్రంగా చూసారు. వీళ్ల మాత్రం ఎవరినీ గమనించడంలేదు. ముగ్గురూ ఒకే సీట్లో కూర్చున్నారు.

బస్సు దిగేవరకూ పెండ్లి ముచ్చటలే! దిగినాక దేవయ్య ముందుగా నడుస్తుంటే ఇద్దరూ అతడి వెంట నడుస్తున్నారు.

"దేవిగాడు. జెరాగితే పిల్లగాన్ని తోలుకరాను పోతడేమో! కూరగాయల కట్నం బాగ అడుగురా..." వెనుకగా నడుస్తున్న బాలయ్య అన్నాడు. లింగం ఇంకేదో అన్నాడు. దేవయ్య మాట్లాడలేదు. ఇల్లు చేరుకునే వరకూ అందరూ మౌనంగానే ఉన్నారు.

అనుకున్నట్టుగా ఇంటిముందు సందడిలేదు. టెంట్ మాత్రం వేసి ఉంది. పచ్చటితోరణాలు గుచ్చారు. పిల్లను పెండ్లికూతురుగా తయారుచేయడానికి బ్యూటీషియన్‌ను తెప్పించారని విని ఎందుకో తెలియక తికమకపడ్డారు ముగ్గురు. బ్యాండు చప్పుడు, పసుపులు ముట్టుడు... ఈ సందడేమో కనిపించడంలేదు. బెరుగ్గా ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ టెంటుకింద కూర్చున్నారు. ఒకరిద్దరు ఆడా, మగా అప్పుడప్పుడూ ఇంట్లోకి, బయటకు వెళ్తున్నారు.

ఎవరికో పనిపురమాయిస్తూ బయటకు వచ్చిన కొండల్‌రావు ముగ్గురినీ చూసాడు. దగ్గరగా వచ్చి 'అరే... ఎప్పుడచ్చింద్రురా... ఇక్కడ కూర్చున్నరేంది? లోపలికి రండి' అంటూ ఆదరంగా పలకరించాడు. ఇంట్లోకి వెళ్ళగానే దొర్సాని, పిల్లలు, కోడలు అందరూ సంతోషంగా పలుకరించారు. వారి పలుకరింపులు కొత్త ఉత్సాహాన్ని పుట్టించాయి.

ఐరేండ్ల మూటను అపురూపంగా అందిస్తూ భద్రపరుచుమని చెప్పాడు బాలయ్య. తానుకూడా సిద్ధమై వచ్చానన్నట్టు గుర్తుగా బట్టలో చుట్టిన గోరు కాలును, ఇత్తడిగిన్నెను అందిస్తూ "దొర్సానీ ఇవ్వీటిని గూడా దాచిపెట్టుండ్రి. యాల్లకు దొరుకయి." అన్నాడు లింగం. దేవయ్యనైతే కలుపుగోలుగా అప్పటికే ఇంట్లోకి చొచ్చుకుని పోయాడు. ఇచ్చిన సామాన్లను కోడలికి అందించి బలవంతంగా వాళ్ళకు భోజనాలు వడ్డించింది దొర్సాని.

'ఊరుమారినా ఆమె మనసు మారలేదు. సల్లని తల్లి' అనుకుంటూ భోజనం చేస్తున్నా మనసును తొలిచే అనుమానం మాత్రం జీర్ణం కావడంలేదు. అడగాలని నోరుతెరిచినా అడగలేక అన్నం ముద్దను కుక్కుకుంటున్నారు. 'అలా ఎందుకౌతుందిలే' అని తమను తాము సరిపుచ్చుకుంటున్నారు. అయినా ఏదో బెంగ!

మైలపోలు రాసేందుకు బోజల బండికాని ఏదిరా అని అడుగుతుందేమోనని లింగం భయపడ్డాడు. కూరాడు కుండలేవిరా అని అడుగుతుందేమోనని బాలయ్య భయపడ్డాడు. ఇంత కాల్చిన సున్నం పట్టుకురావద్దారా అని అంటుందేమోనని దేవయ్య భయపడ్డాడు. దొర్సాని ఏవీ అడుగకుండా కొసరి కొసరి వడ్డించడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నా మనసలో ఏదో భయం మొదలయింది. గుండె దడదడలాడుతుండగానే భోజనం ముగించారు. బాలయ్య, లింగంలు వచ్చి టెంటు కింద కూర్చున్నారు. దేవయ్య ఏదో పనిచేస్తూ అటూఇటూ తిరుగుతున్నాడు. అతడి మాటలు, చేతులు తిప్పుతూ యాక్షన్ చూసాక నవ్వుకుంటూ ఏదో ఒక పని చెబుతున్నారు. 'మీకు నేనే దొరికినానుండ్లా... ఇసీపాపం పాడు గాను. ఏం పాపమిది' మూతులు, చేతులు, నడుము తిప్పుతూ మరింత ఉషారుగా పనిచేస్తున్నాడు దేవయ్య.

(మిగతా వచ్చేవారం)

## రాహు గ్రహం రత్నం గోమేధికం

గోమేధికం రాహు గ్రహం రత్నం. రాహుకేతు గ్రహాలు సౌరకుటుంబంలోని గ్రహాల్లా ఉండవు. కొందరు వీటిని చంద్రుని



నీడలుగా అంటారు. మరికొందరు భూమి నీడలుగా అంటారు. మరికొందరు ఉత్తర దిశ నీడగా రాహువుని, దక్షిణ దిశ నీడగా కేతువుని అంటారు ఎలా చెప్పినా రాహుకేతువులు మాత్రం చాలా ప్రభావవంతమైన గ్రహాలు. గోమేధికం రంగు గోమూత్రంతో సమానం. శ్యామలతామిశ్రితమైన మధువు రూపంలో కనబడుతుంది. ఎవరికి రాహుదశ నడుస్తుందో వారు ఈ గోమేధికం పెట్టుకోవడం మంచిది. మానసిక ఆందోళనతోనూ, పనుల్లో ఆటంకం కలగడం, సంఘర్షణలకు గురైనవారు ఈ గోమేధికం ధరించడం ఎంతో మంచిది. రాహువు ప్రభావం తీవ్రంగా ఉంటే ఆ వ్యక్తికి రోగాలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో చిరాకులు, భార్యాభర్తల మధ్య తగవులు, చెడుకలలు, భయాందోళనలు కలుగుతాయి. ఈ ప్రభావాన్ని తగ్గించుటకు గోమేధికం ధరించాలి. గోమేధికం ధరించిన వారి ఎదుట శత్రువులు ఎక్కువ కాలం నిలవలేరని అంటారు. ఆయుర్వేద గ్రంథంలో గోమేధికం భస్మాన్ని దగ్గుకి, ముఖసౌందర్యానికి, వయోవృద్ధికి ఉపయోగిస్తారు.

గోమేధికం ధరించిన రోజు నుండి మూడు సంవత్సరాల పాటు రత్న ప్రభావం ధరించిన వారిపై ఉంటుంది. ఫిబ్రవరి 15 నుండి మార్చి 14 లోపు పుట్టినవారు, 4 అదృష్ట సంఖ్యగా గలవారు ఈ రత్నాన్ని ధరించడం మంచిది. గోమేధికం వాటి ఉపరత్నాలైన టైగర్ ఐ, గార్‌నెట్, హిస్సానెట్, జిర్‌కాన్ ఫామిలిని కెంపు, ముత్యం, పగడం, కనక పుష్యరాగంతో కలిపి ధరించరాదు.

– డా॥ ఆమంచి బాలసుధాకరశాస్త్రి

SRI MAHARISHI RUDRAKSHA
& NAVARATHNA EMPORIUM
No. : 13 Gayathri Towers,
Opp. Old Busstand,
Near Kesineni Tours & Travels
VIJAYAWADA-2
Phones : 0866-570199, 663335
BRANCH OFFICE :
6-3-354/10, Hindinagar,
Punjagutta, HYDERABAD.
Phone : 040-6636686, 6636696